కొత్త డివిజన్లు ఎనిమిది

- జూబ్లీహిల్స్‌లో ఆరు.. ఖైరతాబాద్‌లో రెండు
- సరిహద్దుల ప్రకటన..
  అభ్యంతరాలకు గడువు వారం రోజులు
- జీహెచ్‌ఎంసీ ముసాయిదా విడుదల



బంజారాహిల్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డుల సంఖ్య పెంచుతూ జీహెచ్‌ఎంసీ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. ఇందులో భాగంగా వార్డులు వాటి సరిహద్దులను ప్రకటించారు. అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లోగా చెప్పాలని అధికారులు సూచించారు. కాగా కొత్త వార్డుల ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏకంగా ఆరు కొత్త డివిజన్‌లు ఏర్పాడుతున్నాయి. జూబ్లీహిల్స్‌లో గతంలో బోరబండ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, షేక్‌పేట, సోమాజిగూడలో సగ భాగం ఉండేది. తాజా ముసాయిదాలో సోమాజిగూడ సగ భాగాన్ని తొలగించి ఈ స్థానంలో శ్రీనగర్ కాలనీని కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఇక మధురానగర్, ఓయుకాలనీ, కార్మికనగర్, రాజీవ్‌నగర్ పేరిట కొత్త డివిజన్‌లు ఏర్పడ్డాయి. ఖైరతాబాద్ రెండు కొత్త డివిజన్‌లుగా ఏర్పాటు చేశారు. పాత బంజారాహిల్స్, వెంకటేశ్వరనగర్ కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్‌తో పాటు కొత్తగా ఎర్రమంజిల్, ఫిలింనగర్ డివిజన్‌లు ఏర్పాడ్డాయి.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం

ఎర్రగడ్డ, మధురానగర్, శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావునగర్, కృష్ణానగర్, రహ్మత్‌నగర్, కార్మికనగర్, రాజీవ్‌నగర్, బోరబండ., షేక్‌పేట, ఓయు కాలనీ డివిజన్లకు సరిహద్దులను ప్రకటించారు.

ఖైరతాబాద్ నియోజకవర్గం

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్, ఎర్రమంజిల్, సోమాజిగూడ డివిజన్లకు సరిహద్దులను ప్రకటించారు.



నారీ శక్తి యాప్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న పీవీ సింధు

హైటెక్‌సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ హక్కుల కోసం నారీ మణులంతా పోరాడటంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇంటి నుంచే ఆదాయ మార్గాలను అన్వేషించుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. మంగళవారం మాదాపూర్.. హోటల్ ఆవాసాలో ఈబీజీ గ్రూప్ సంస్థ సమావేశం నిర్వహించింది. సింధు సంస్థ ఏర్పాటు చేసిన 'నారీ శక్తి ' అనే యాప్‌ను ఆమె ఆవిష్కరించారు. మహిళల తక్షణ సహాయం కోసం ఏర్పాటు చేసిన జాతీయ హెల్ప్ లైన్ 77777 77963 అందుబాటులోకి తెచ్చారన్నారు. సంస్థ చైర్మన్ ఇర్ఫాన్ ఖాన్ మాట్లాడుతూ 2025-26కు గాను సంబంధించి తమ ఫౌండేషన్ ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రూ.8.5 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

హైటెక్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగ్లా దేశ్‌కు చెందిన ఓ మహిళ బనానాదాస్‌కు మెడికవర్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణం పోశారు. మంగళవారం మాదాపూర్‌లోని ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో కార్డియోథొరాసిక్ వైద్యుడు ప్రమోద్ రెడ్డి వివరాలను తెలిపారు. బంగ్లాదేశ్‌కు చెందిన 65 ఏళ్ల బనానాదాస్ ఛాతి నొప్పి, కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరారని అన్నారు. స్కానింగ్‌లో గుండె నుంచి వచ్చే వాలు పాడైనట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. 'జెయింట్ అబ్డామినల్ ఎయోర్టిక్ ఎన్యూరిజమ్‌ను తొలగించామన్నారు. ఆభాగంలో కృత్రిమ గ్రాఫ్ట్ అమర్చామని తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం ఐదురోజులపాటు పరిశీలనలో ఉంచి డిశ్చార్జి చేశామన్నారు.

అవయవదానం.. ఐదుగురికి ప్రాణదానం


కృష్ణకుమారి (ఫైల్)

నిమ్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్‌తో మృతిచెందిన మహిళ అవయవదానంతో ఐదుగురి ప్రాణాలు నిలబడ్డాయి. విషయానికొస్తే.. రంగారెడ్డి జిల్లా ఉప్పల్ పీర్జాదిగూడకు చెందిన ముత్తులూరు కృష్ణకుమారి (58) ఒక గృహిణి. ఈమెకు క్రానియోటమీ సర్జరీ జరిగింది. తరచూ బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. రెండు రోజుల క్రితం ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. జీవన్ దాన్ వైద్యులు అవయవదానంపై ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అంగీకరించడంతో కిడ్నీలు, లివర్, కార్నియాస్‌ను సేకరించి ఐదుగురికి అమర్చారు.

హెల్త్ క్యాంపునకు స్పందన

పంజాగుట్ట, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు అందరూ కార్డియాక్ హెల్త్‌పై దృష్టిపెట్టాలని జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి కాథ్ ల్యాబ్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ కుమార్ అన్నారు. హైదర్ గూడ అపోలో ఆసుపత్రి సహకారంతో మంగళవారం ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టుల కోసం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్డియాక్ హెల్త్ క్యాంపునకు మంచి స్పందన వచ్చింది. బీపీ, గుండె సంబంధిత సమస్యలూ ఇలాంటి హెల్త్ క్యాంపుల్లోనే బయటపడుతున్నాయని కార్డియాలజిస్టు డాక్టర్ రామకృష్ణ అన్నారు. అవసరమైతే ఆసుపత్రి తరఫున 50 శాతం వరకు కూడా డిస్కౌంట్ అందించగలమని హామీ ఇచ్చారు.

బీజేపీ మరింత బలోపేతం

బేగంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు బీజేపీ మహాకాళి - సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి నందనం దివాకర్ అన్నారు. బీజేపీ జిల్లా నూతన ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా మంగళవారం బేగంపేటలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నందనం దివాకర్‌ను మర్రి శశిధర్‌రెడ్డి సన్మానించారు. అనంతరం నందనం దివాకర్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకెళ్లాలన్నారు.

ఏడు వారాల నగల ప్రదర్శన

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ ఏడు వారాల నగలకు.. ఆధునిక నగిషీలు చెక్కి, నవరత్నాలు పొదిగి అందుబాటులోకి తీసుకు వచ్చారు జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లోని ప్రఖ్యాత ది డైమండ్ స్టోర్ బై చందుబాయ్ నిర్వాహకులు. ఆధునిక వధువుల మనసు దోచుకునేలా సిద్ధం చేసిన ఏడు వారాల నగల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కొట్టిశ్రీకాంత్ మాట్లాడుతూ దేశ సంస్కృతికి, సంప్రదాయానికి గౌరవ సూచకంగా ఈ ప్రత్యేక కలెక్షన్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు.


ఏడు వారాల నగలతో ఓ మోడల్

గ్లోబల్ సమ్మిట్‌తో మరింత గుర్తింపు

- ఈ ఘనత సీఎం రేవంత్‌దే
- ఎమ్మెల్యే దానం నాగేందర్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు తదితరులు

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తొలి రోజే నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా అనేక మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 46 అంబేడ్కర్‌నగర్‌లో రూ.25 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. రైజింగ్ తెలంగాణ పేరిట భవిష్యత్ తెలంగాణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి బాటలు వేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉందని విదేశాలకు చెందిన అనేక కంపెనీలు రాష్ట్రంలో సదుపాయాలను చూసి శాఖలు ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నారు. రాబోయే రెండేళ్లలో నిరుద్యోగ సమస్య 50 శాతానికి తగ్గుతుందని తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 35 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్టు చెప్పారు. డివిజన్‌ల వారీగా సమస్యలను పరిశీలించి, వాటి కోసం నిధులను ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. ప్రతీ బస్తీలో తాగునీరు. డ్రైనేజీ పనులు పూర్తయిన తరువాత శాశ్వత ప్రాతిపాదికన సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. స్ట్రీట్ లైట్ల గురించి ప్రత్యేక దృష్టి కేటాయించినట్టు వెల్లడించారు. అంబేడ్కర్ బస్తీలో పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేసి వారంలో తాగునీరు సరఫరా అయ్యేలా కార్యాచరణ చేపడుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ 23 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, సుధాకర్‌రెడ్డి, బస్తీ నాయకుల అశోక్, వెంకట్ నర్సు, బిక్షపతి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు ఆరోపణలు అర్థరహితం

డా.చిన్నారెడ్డి


దివ్యాంగ వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి

బేగంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీ.ఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కారంలో దాదాపు 70 శాతం సక్సెస్ రేటు ఉందని, కానీ మాజీ మంత్రి హరీష్‌రావు సీ.ఎం ప్రజావాణిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సీ.ఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైఎస్ చైర్మన్ చిన్నారెడ్డి విమర్శించారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో జరిగిన సీ.ఎం ప్రజావాణిలో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా హరీష్‌రావు మాట్లాడడం సరికాదన్నారు. అబద్ధాలతో, తప్పుడు సమాచారంతో ఆయన కాలం గడుపుతున్నారని విమర్శించారు. సీ.ఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని ప్రజాభవనంలో అధికారిక కార్యక్రమాలే జరుగుతున్నాయన్నారు. కరీంనగర్‌కు చెందిన గొడుగు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాలేదని హరీష్‌రావు విమర్శించారని, అసలు ఆ వ్యక్తి ఎవరో తమ రికార్డుల్లో లేదన్నారు. కనీసం కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేని ప్రగతి భవన్ ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రజాభవన్‌గా మార్చి, సీ.ఎం ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కల్పించారని పేర్కొన్నారు.

- సీఎం ప్రజావాణికి 336 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీ.ఎం ప్రజావాణికి మొత్తం 336 దరఖాస్తులు వచ్చాయి. సీ.ఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 102, రెవెన్యూకు 29, ఇందిరమ్మ ఇళ్లకు 136, మున్సిపల్‌శాఖకు 15, ప్రవాసి ప్రజావాణికి 3, ఇతర శాఖలకు చెందిన 51 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఎలక్ట్రీషియన్ మృతి

పంజాగుట్ట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఓ ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పంజాగుట్ట పరిధిలో ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ ఎం.ఎస్ మక్తాకు చెందిన ఎండీ దానిష్ రియాజ్ (25)వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. సోమవారం పంజాగుట్టలోని కృష్ణ జ్యువెలరీ షాప్‌లో రెండో అంతస్తులో లిఫ్ట్ మరమ్మతులు చేస్తుండగా అతను లిఫ్ట్ గ్లాస్ డోర్ వద్ద కింద పడిపోయి ఉన్నాడు. గమనించిన సిబ్బంది అతడిని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే రియాజ్ మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పీఎంఈ నిమిత్తం గాంధీకి తరలించారు. ఐదు నెలల క్రితమే అతనికి పర్వీన్ తో వివాహం జరిగింది. రియాజ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ కార్పొరేటర్ షరీఫ్ పరామర్శించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక ఎలా మృతిచెందాడో తెలుస్తోందని ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పంజాగుట్ట, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. కళ్యాణ్ నగర్ వెంచర్-1లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఏఈ హుస్సైనాభాను, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శేఖర్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

యువకుడిపై మూకుమ్మడి దాడి

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు.. యువకుడిపై దాడికి పాల్పడ్డారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రమోద్ పాశ్వాన్ ఈనెల 5న కూకట్‌పల్లిలో నిర్వహించిన ఓ పార్టీకి వెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనం వస్తుండగా జూబ్లీహిల్స్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఓ యువతి అడ్డుగా వచ్చింది. ఆమె వెనుక నుంచి వచ్చిన పలువురు గుర్తు తెలియని వ్యక్తులు ప్రమోద్‌ను దుర్భాషలాడటంతో పాటు దాడి చేసి ఇక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనలో అతను అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు .. అతడిని అపోలో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వైద్యుడి ఇంటికెళ్లి దౌర్జన్యం

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో వైద్యుడి ఇంట్లోకెళ్లి దౌర్జన్యం చేసిన గుర్తుతెలియని నలుగురిపై కేసు నమోదైంది. ఫిలింనగర్‌లో నివాసముండే డాక్టర్ వీ.కోటేశ్వరరావు మెడికవర్ ఆసుపత్రిలో అర్థోపెడిక్ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 8న అర్ధరాత్రి దాటిన తరువాత నలుగురు ఆయన ఇంట్లోకి నలుగురు అక్రమంగా ప్రవేశించారు. దుర్భాషలాడాటంతో హడావిడి చేశారు. అక్కడ ఉన్న సామాన్లను పగలకొట్టి పారిపోయారు. వైద్యుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్ఫెక్షన్ల తీవ్రత ఆందోళనకరం

డాక్టర్ టామ్ చెరియన్


మాట్లాడుతున్న డాక్టర్ టామ్ చెరియన్

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం కాలేయ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో ఇన్ఫెక్షన్ల తీవ్రత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశమని సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండున్నరేళ్ల పాటు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న 67 మంది రోగుల ఆరోగ్యంపై నిర్వహించిన అధ్యయనంలో బహుళ మల్టీ డ్రగ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎండీఆర్) తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తేలిందన్నారు. 24 శాతం మందిలో బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ఉండగా మరి కొంత మందిలో ఇతర సమస్యలు ఉన్నాయన్నారు. 16 బ్యాక్టీరియా కేసుల్లో 15 మందిలో యాంటీ బయాటిక్స్‌కు పూర్తిగా రెసిస్టెంట్‌గా ఉండటం ఆందోళనకరంగా ఉందన్నారు. కొన్ని కేసుల్లో యాక్సా జోలిడినోన్ తరగతికి చెందిన ఔషధాల పట్ల కూడా ప్రతిఘటన కనిపించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. పాజిటివ్ వచ్చిన 16 మందిలో తొమ్మిది మంది సర్జరీకి ముందే రక్త పరీక్షల్లో బ్యాక్టీరియా ఉన్నట్లు తేలిందన్నారు. ఈ అధ్యయనం వల్ల ఆరోగ్య విధానాల్లో చికిత్సా పద్ధతుల్లో మార్పు అవసరం ఉన్నదని సూచిస్తోందన్నారు. శస్త్ర చికిత్సకు ముందే ఇలాంటి ఇన్ఫెక్షన్లను గుర్తించి నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది జాతీయ స్థాయిలో ఆరోగ్య సంక్షోభంగా భావించాల్సి ఉంటుందని ప్రజలతో పాటు అన్ని వర్గాల వారు ఈ సమస్యపై తక్షణమే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో పెను ప్రమాదం

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధనాగౌడ్

బేగంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యానికి పెను ప్రమాదమని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించవలసిన బాధ్యత యువతపై ఉందని జీహెచ్‌ఎంసీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధనాగౌడ్ అన్నారు. మంగళవారం బేగంపేట.. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా పొగాకు ఉత్పత్తుల వాడటం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ముఖ్యంగా పొగాకు వాడకం వల్ల క్యాన్సర్‌తో పాటు పలు వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించవలసిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులతో పాటు అధ్యాపకులు, జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్టీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

హామీలు అమలు చేయాలి

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్ల భారీ ధర్నా

పంజాగుట్ట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ ఆరోపించింది. మంగళవారం ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్లు భారీ ధర్నా నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం, జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆటోడ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు వంటి ఇచ్చిన హామీలు అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ధర్నాతో పంజాగుట్ట-ఖైరతాబాద్ మార్గంలో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎల్.రూప్ సింగ్, ఏం.ఏ. సలీం,ఈ.ప్రవీణ్, వేముల మారయ్య, ఏ.సత్తిరెడ్డి, జి.శ్రీనివాస్, యాదగిరి, ఎస్. అశోక్, సీహెచ్. జంగయ్య, ఒమర్ ఖాన్, ఎ.నరసింహ, రాంకిషన్, లింగం గౌడ్, కృష్ణ, పెద్దసంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఘనంగా దీక్షా దివస్



దీక్షా దివాస్ సందర్భంగా పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్ ,కాలేరు వెంకటేష్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, నాయ కులు పాల్గొన్నారు.
నిమ్స్,ఆంధ్రజ్యోతి



తెలంగాణ ప్రకటన వెలువడిన డిసెంబరు 9ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ దీక్షా దివస్ పేరిట మంగళవారం వేడుకలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో మాగంటి సునీత, కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్ కుమార్ పటేల్‌లు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

పెళ్లి పేరుతో వంచన

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని ప్రేమికుడు నమ్మించాడు. యువతి నుంచి పలుమార్లు డబ్బు కూడా తీసుకొచ్చాడు. చివరాఖరుకు ముఖం చాటేశాడు. ఈ వ్యవహారంపై ప్రియురాలు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఉదంతం వెలుగుచూసింది. ఇందిరానగర్‌లో నివాసముండే యువతి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నది. 2023లో ఆర్మీ ఉద్యోగి అయిన వారణాసికి చెందిన మనీష్‌తో పరిచయం ఏర్పడింది. ఆతర్వాత అతను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో అతడికి అవసరమైనప్పుడు డబ్బులు పంపించింది. ఇటీవల రాజస్థాన్‌కు బదిలీ కాగా వెళుతున్నట్టు మనీష్ చెప్పాడు. కొద్ది రోజులకు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరింది. అతను ఫోన్ ఎత్తడం మానేశాడు. తాను మోసపోయినట్టు గ్రహించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పిల్లలతో ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, కార్పొరేటర్ సంగీతాయాదవ్, సాయినాథ్‌యాదవ్

ఘనంగా సోనియా గాంధీ జన్మదినం

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినాన్ని మంగళవారం పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు.
జోన్ బృందం, ఆంధ్రజ్యోతి


శానిటేషన్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలిమ



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే యమపురే

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే యమపురే దిక్కని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రుల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గురవరెడ్డి పర్యవేక్షణలో, శ్రవేణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహంకాళి ట్రాఫిక్ పోలీసులను సమన్వయం చేసుకుంటూ మంగళవారం రాణిగంజ్ సిగ్నల్ వద్ద నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు వాహనదారులు, ప్రయాణికులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, లేన్ డిసిప్లేన్‌ల ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు పాటించిన పౌరులకు ప్రోత్సాహకంగా 5స్టార్ చాక్లెట్లు, గులాబీపూలను అందజేశారు. అదేవిధంగా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.

నేడు మానవ హక్కుల దినోత్సవం

అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల దినోత్సవాన్ని డిసెంబరు 10న పలు సేవా సంస్థలు, న్యాయ, పోలీస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించుకునే మంచి ఆలోచనతో కూడిన దినోత్సవంను దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ దినోత్సవం 1948లో మొదలైంది. ఆ రోజునే ఐక్యరాజ్య సమితి సాధారణ సభ సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనను ఆమోదించిన రోజు. ఈ దినోత్సవాన్ని ప్రతి ఏడాది డిసెంబరు 10న జరుపుకుంటారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ మొట్టమొదటి చైర్మన్‌గా జస్టిస్ రంగనాథ్ మిశ్రా నియమితులయ్యారు.

హక్కుల కమిషన్ అనేది రాజ్యాంగ సంస్థ

మానవ హక్కుల కమిషన్ అనేది రాజ్యాంగ, చట్టబద్ధంగా ప్రజలకు కల్పించిన హక్కుల రక్షణ బాధ్యతలను చేపట్టే ఒక సంస్థ. దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ 1993లో మానవ హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ఏర్పడింది. దేశంలోని ఏ వ్యక్తి హక్కులకు భంగం కలిగించినా లేదా అన్యాయం జరిగినా ప్రశ్నించడానికి పరిశోధించడానికి ఈ మానవ కమిషన్ ప్రజల కోసం పని చేస్తుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీపుల్స్ ప్లాజా పెట్‌స్టాప్ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. లేక్ పోలీస్ ఏఎస్ఐ బాల పీరయ్య తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి పెట్రోకార్-1లో ఉమెన్ కానిస్టేబుల్ బిట్ల కరుణ, ఎస్పీఓ రంజిత్ కుమార్ సింగ్‌లతో కలిసి హెడ్ కానిస్టేబుల్ షేక్‌ఖాజా విధులు నిర్వహిస్తుండగా పీపుల్స్‌ప్లాజా పెట్‌స్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సెక్షన్ 194 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చ్యూరీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే 8712570381, 8712665187 నెంబర్లపై కానీ లేక్ పోలీస్ స్టేషన్‌లో కానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో వృద్ధుడు మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ బదునేపల్లి గ్రామానికి చెందిన ఆత్మకూరి నరసయ్య(62) మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వెయింటింగ్ హాలులో అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?



ఉమాశంకర్

బౌద్ధనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెళ్లికి నిరాకరించిందన్న ఆగ్రహంతో యువతిని అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని వారాసిగూడ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పార్శీగుట్ట బాపూజీనగర్‌లో నివసించే పవిత్రను మేనబావ ఉమాశంకర్(25) సోమవారం పవిత్ర తల్లి, చెల్లి ముందే అతిదారుణంగా హత్య చేసి పరారయ్యాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా జవహర్‌నగర్‌లో ఉమాశంకర్‌ను పోలీసులు అదుపులోకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు ఉమాశంకర్‌ను గోప్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

స్నేహితుల మధ్య తగాదా.. హత్యాయత్నం

బౌద్ధనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్నేహితుల మధ్య తలెత్తిన తగాదా ఒకరి హత్యాయత్నానికి దారి తీసిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వారాసిగూడకు చెందిన జె.సుమన్, రాజు యాదవ్, శ్యామ్, శ్రీను, ఉపేందర్‌లు స్నేహితులు. వీరందరూ 8వ తేదీ రాత్రి రాంనగర్‌లో బిర్యానీ తినటానికి వెళ్లారు. బిర్యానీ తింటున్న సందర్భంలో సుమన్, రాజుయాదవ్‌లు మధ్య తగాదా తలెత్తింది. కక్ష పెంచుకున్నా రాజుయాదవ్ మంగళవారం సుమన్ ఇంటికి వెళ్లి నిద్రిస్తున్న అతడిపై తలపై బండరాయితో మోదాడు. దీంతో సుమన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సుమన్‌ను కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు సూచనలు మేరకు నిమ్స్‌కు తరలించారు. నిందితుడు నిమ్స్ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజుయాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాజుయాదవ్‌పై హత్యాయత్నం కేసును నమోదు చేశారు.

లష్కర్‌లో పెరిగిన డివిజన్లు

● సికింద్రాబాద్‌లో 5 నుంచి 8 ● సనత్‌నగర్‌లో 5 నుంచి 8 ● కంటోన్మెంట్‌లో అప్పుడూ, ఇప్పుడూ ఒకే డివిజన్

సికింద్రాబాద్ జోన్ బృందం-ఆంధ్రజ్యోతి: జీహెచ్ఎంసీ పరిధి విస్తరించిన నేపథ్యంలో లష్కర్‌లో కూడా డివిజన్ల సంఖ్య పెరిగాయి. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, సనత్‌నగర్ నియోజకవర్గంలో మూడు డివిజన్లు కొత్తగా వచ్చి చేరాయి. కంటోన్మెంట్‌లో ఎలాంటి పెరుగుదల లేదు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇంతకు ముందు ఐదు డివిజన్లు. బౌద్ధనగర్, సీతాఫల్‌మండీ, మెట్టుగూడ, తార్నాక, అడ్డగుట్ట డివిజన్లు ఉండగా, తాజాగా లాలాపేట్, నార్త్‌లాలాగూడ, చిలకలగూడ డివిజన్లు కొత్తగా ఆవిర్భవించాయి. అంటే ఈ నియోజకవర్గంలో ఐదు డివిజన్లు కాస్తా ఎనిమిదికి మారాయి. అదేవిధంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో ఇంతకు ముందు ఐదు డివిజన్లు.. బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్లు ఉండగా, తాజాగా పద్మారావునగర్, బీ.కే.గూడ, ఎస్.ఆర్.నగర్ డివిజన్లు కొత్తగా ఆవిర్భవించాయి. అంటే ఈ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లు కాస్తా ఎనిమిదికి చేరాయి. కాగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఇంతకు ముందు ఉన్న మోండా మార్కెట్ డివిజన్‌నే కొనసాగించారు.

బౌద్ధనగర్ డివిజన్

- **తూర్పు:** ఆర్ట్స్ కాలేజీ ఇంటి నెంబర్(12-11-1553) నుంచి జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ (12-11-1595) వరకు కొనసాగుతుంది.
- **దక్షిణం:** జామై ఉస్మానియా రైల్వేస్టేషన్(12-11-1595) నుంచి బౌద్ధనగర్, పార్శీగుట్ట రోడ్డు, బస్టాండ్, పార్శీగుట్ట శ్మశానవాటిక ఇంటి నెంబర్ (11-3-664/34) వరకు కొనసాగుతుంది.
- **పడమర:** పార్శీగుట్ట శ్మశానవాటిక ఇంటి నెంబర్ (11-3-664/34) పార్శీగుట్ట మెయిన్‌రోడ్డు, బాపూజీనగర్ ఎక్స్‌రోడ్డు ఇంటి నెంబర్ 11-3-357/108, 11-3-413/1 వరకు కొనసాగుతుంది.
- **ఉత్తరం:** బాపూజీనగర్ ఎక్స్‌రోడ్డు ఇంటి నెంబర్ 11-3-357/108, 11-3-413/1 నుంచి మెథోడిస్ట్ చర్చి, మహ్మద్‌గూడ రోడ్డు, వారాసిగూడ ఎక్స్‌రోడ్డు టర్నింగ్ పాయింట్ ఆర్ట్‌కాలేజీ ఇంటినెంబర్ 12-11-1553 వద్ద ముగిస్తుంది.

బౌద్ధనగర్ డివిజన్‌లో వచ్చే ప్రాంతాలు: జామై ఉస్మానియా, లలితానగర్‌కాలనీ, అంబర్‌నగర్, ఎల్.నారాయణనగర్, అంబానగర్, వారాసిగూడ, మధురానగర్‌కాలనీ, షాబాద్‌గూడ, న్యూఅశోక్‌నగర్, పార్శీగుట్ట, బాపూజీనగర్ ఎక్స్‌రోడ్డు

చిలకలగూడ డివిజన్

- **తూర్పు:** సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ (ఇంటి నెంబర్ 11-2-1/1) నుంచి నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి నుంచి (ఇంటి నెంబర్ 12-10-614) వారాసిగూడ చౌరస్తా వరకు ఉంటుంది.
- **దక్షిణం:** (ఇంటి నెంబర్ 12-10-614) వారాసిగూడ చౌరస్తా నుంచి మహ్మద్‌గూడ రోడ్డు మీదుగా బాపూజీనగర్ క్రాస్ వరకు ఉంటుంది.
- **పడమర:** బాపూజీనగర్ క్రాస్‌రోడ్డు నుంచి పద్మారావునగర్ రోడ్డువైపున స్కందగిరి ఆలయం, శ్రీనివాస్‌నగర్, ఫ్రైడేమార్కెట్, వెస్లీ చర్చి రోడ్డు, ఇక్బాల్ రైల్వే క్వార్టర్స్, ఇంటినెంబర్ (11-4-906 వరకు చేరి సినిమా టాకీస్ క్రాస్ రోడ్డు వద్ద ముగిస్తుంది.
- **ఉత్తరం:** అమర్ టాకీస్ క్రాస్ రోడ్డు నుంచి చిలకలగూడ గాంధీ విగ్రహం, మైలార్‌గడ్డ రోడ్డు దాటుతూ సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ వద్ద 11-2-1/1వరకు కొనసాగుతుంది.

చిలకలగూడ డివిజన్‌లో వచ్చే ప్రాంతాలు: చిలకలగూడ, మైలార్‌గడ్డ, నామాలగుండు, వేంకటేశ్వరనగర్‌కాలనీ, ఉప్పరబస్తీ, బ్రాహ్మణబస్తీ, శ్రీనివాస్‌నగర్, మహ్మద్‌గూడ, వారాసిగూడ ఎక్స్‌రోడ్డు, బాపూజీనగర్ ఎక్స్‌రోడ్డు

అడ్డగుట్ట డివిజన్

- **ఉత్తరం:** లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి ముందుకు వెళితే ఎడమవైపున తుకారాంగేట్ చౌరస్తా నుంచి మరాఠబస్తీ వైపు ఉంటుంది. మరాఠబస్తీ నుంచి ముందుకు వెళితే సాయినగర్, బుద్ధానగర్, పహాడి హనుమాన్ ఆలయం, అడ్డగుట్ట ఏబీసీడీ సెక్షన్లు, లోహియనగర్ ప్రాంతాలు వరుస క్రమంలో ఉంటాయి.
- **తూర్పు:** అడ్డగుట్ట నుంచి మొదలుకొని ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీ నుంచి ముందుకు వస్తే అడ్డగుట్ట బస్తీ, లంబాడిబస్తీ, శాస్త్రినగర్, జయప్రకాశ్‌నగర్, ఇందిరాలక్ష్మినగర్, వెంకట్‌నగర్ ప్రాంతాలు ఉంటాయి.
- **పడమర:** సాయిబాబా ఆలయం, కేజీ హాస్పిటల్, ఎంసీహెచ్ క్వార్టర్ ప్రాంతాలు ఉంటాయి.
- **దక్షిణం:** సౌత్‌లో రైల్వే ట్రాక్ మాత్రమే ఉంది. ఇక్కడ ఇళ్లు లేవు

ఈ డివిజన్‌లో ఉన్న ప్రాంతాలు: శాంతినగర్ (లాలాగూడ) నుంచి తుకారాంగేట్, సాయినగర్, మరాఠబస్తీ, బుద్ధానగర్, తుకారాంగేట్ వడ్డెర బస్తీ, అడ్డగుట్ట ఏబీసీడీ సెక్షన్లు, లోహియనగర్, ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ వెంకట్‌నగర్, లంబాడిబస్తీ, సాయినగర్, శాస్త్రీనగర్, జయప్రకాశ్‌నగర్, ఎంసీహెచ్ క్వార్టర్ ప్రాంతాలు అడ్డగుట్ట డివిజన్‌లో ఉన్నాయి.

మెట్టుగూడ డివిజన్

- **తూర్పు:** లాలాగూడ రైల్వేస్టేషన్ నుంచి లాలాపేట్(ఎల్ఎస్‌సీపీడీసీఎల్ ఆఫీస్), తార్నాక చౌరస్తా నుంచి బీపీసీల్ వైపు సాగి సీతాఫల్ మండీ(ఎన్ఐఎన్) క్వార్టర్స్ వద్ద ముగిస్తుంది.
- **దక్షిణం:** సీతాఫల్‌మండి ఎన్ఎన్ఎన్ క్వార్టర్స్ నుంచి ప్రారంభమై సీతాఫల్‌మంతః ఫ్లైఓవర్, సీతాఫల్‌మండీ ఎక్స్‌రోడ్డు ఇంటినెంబర్ 12-12-1574 వద్ద, కోహూరి కన్సల్టెన్సీ నుంచి ఇంటినెంబర్ 10-3-1/10 మైలార్‌గడ్డ, చిలకలగూడ గాంధీ విగ్రహం, అమర్‌టాకీస్ జంక్షన్, వైట్ హౌజ్ బార్ సమీపంలో చిలకలగూడ బడి మాజ్జాలి, రైల్వే క్వార్టర్స్ బోయిగూడ మెయిన్‌రోడ్డు, చిలకలగూడ ఎక్స్‌రోడ్డు, బోయిగూడ రైల్వే బ్రిడ్జి మార్గం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఇంటినెంబర్ 10-7-663, 10-7-75 వద్ద ముగిస్తుంది.
- **పడమర:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఇంటి నెంబర్ 10-7-663, 10-7-75 నుండి అల్ఫా హోటల్ ఎక్స్‌రోడ్డు నుండి రేతిఫైల్ బస్‌స్టాండ్ వద్ద ముగిస్తుంది.
- **ఉత్తరం:** రేతిఫైల్ బస్టాండ్ నుంచి రైల్వేక్వార్టర్స్, రైల్ నిలయం, ఆర్‌ఆరేసీ గ్రౌండ్, రైల్వే వర్క్‌షాపు మీదుగా లాలాగూడ రైల్వేస్టేషన్ వరకు కొనసాగుతుంది.

మెట్టుగూడ డివిజన్‌లో వచ్చే ప్రాంతాలు: మెట్టుగూడ, కేశవనగర్‌కాలనీ, రైల్వేకార్టర్స్, బోయిగూడ, చిలకలగూడ ఎక్స్‌రోడ్డు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అల్ఫా హోటల్, రేతిఫైల్ బస్టాండ్

సీతాఫల్‌మండీ డివిజన్

- **తూర్పు:** సరిహద్దు ఇఫ్లూ(ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్శిటీ నుంచి రవీంద్రనగర్(12-12-64) నుంచి మాణికేశ్వరినగర్ మీదుగా ఓయూ పెట్రోల్ బంక్(ఇం.నెం.12-15-1014) వరకు కొనసాగుతుంది.
- **దక్షిణం:** ఓయూ పెట్రోల్ బంక్ నుంచి ఆర్ట్స్ కాలేజీ (12-15-1 అండ్ 12-15-24 అండ్ 12-15-994) నుంచి వారాసిగూడ మెయిన్‌రోడ్డు(11-3-357/16/డి) వరుణసాయి మ్యాచింగ్ సెంటర్ వద్ద ముగిస్తుంది.
- **పడమర:** వారాసిగూడ వరుణసాయి మ్యాచింగ్ సెంటర్ (11-3-357/16/డి) నుంచి నామాలగుండు, పయనీర్ బేకరీ మీదుగా సీతాఫల్‌మండీ చౌరస్తా వరకు కొనసాగుతుంది.
- **ఉత్తరం:** సీతాఫల్‌మండీ పయనీర్ బేకరీ నుంచి సీతాఫల్‌మండీ చౌరస్తా మీదుగా సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ మీదుగా ఇఫ్లూ వరకు(12-12-64 వరకు కొనసాగుతుంది.

సీతాఫల్‌మండి డివిజన్‌లో వచ్చే ప్రాంతాలు: ఇఫ్లూ, రవీంద్రానగర్, మాణికేశ్వరినగర్, సీతాఫల్‌మండి, మేడిబావి, బీదలబస్తీ, వారాసిగూడ ఎక్స్‌రోడ్డు, బాపూజీనగర్ ఎక్స్‌రోడ్డు

రాంగోపాల్‌పేట్ డివిజన్

ఈ వార్డులో ప్రస్తుతం ఉన్న యథాస్థితిని కొనసాగించారు. ఎటువంటి మార్పు జరగలేదు

- **తూర్పు:** ప్యాట్నీ జంక్షన్ నుంచి ప్రారంభమై బాటా జంక్షన్ వైపు కొనసాగి జనరల్ బజార్‌ను కలుపుకొని, సిటీ లైట్ హోటల్ వైపు వెళ్లి ఓల్డ్ బోయిగూడ ప్రాంతాన్ని కలుపుతూ బైబిల్‌హౌస్ వైపు వెళ్లి జీరా ప్రాంతాన్ని కలుపుతూ కవాడిగూడ ప్రధాన రహదారి వద్ద ముగుస్తుంది.
- **దక్షిణం:** వార్డు దక్షిణ సరిహద్దు బుద్ధభవన్ నుంచి నెక్లెస్ రోడ్డు మీదుగా అంబేద్కర్ నగర్, హైదర్ బస్తీ, ఓల్డ్ ఘాస్మండి ప్రాంతాన్ని కలుపుతూ మినిస్టర్ రోడ్డులోని ప్రస్తుత రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ (పాత ఆర్‌డీఓ కార్యాలయం) వద్ద ముగుస్తుంది.
- **పడమర:** వార్డు పశ్చిమ సరిహద్దు బుద్ధ భవన్ నుండి నెక్లెస్ రోడ్డు మీదుగా అంబేద్కర్ నగర్, హైదర్‌బస్తీ, ఓల్డ్ ఘాస్మండి ప్రాంతాన్ని కలుపుతూ ప్రస్తుత రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ (పాత ఆర్‌డీఓ కార్యాలయం) వద్ద ముగుస్తుంది
- **ఉత్తరం:** ప్రస్తుత రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ (పాత ఆర్‌డీఓ కార్యాలయం) నుండి ప్రారంభమై, వెస్లీ జూనియర్ కళాశాల ప్రాంతాన్ని కలుపుతూ, ప్యారడైజ్ హోటల్ వైపు వెళ్ళి, సిటిసి వైపు వెళ్లి కళాసిగూడ ప్రాంతాన్ని కప్పి మంజు థియేటర్ వైపు వెళ్ళి ప్యాట్నీ జంక్షన్ వద్ద ముగుస్తుంది.

ఈ డివిజన్‌లో అంబేద్కర్‌నగర్, హైదర్‌బస్తీ, ఓల్డ్‌ఘాస్మండి, పాన్‌బజార్, మహంకాళి ఆలయం, బర్తన్‌బజార్, కళాసిగూడ, సోమసుందరం వీధి తదితర ప్రాంతాలు ఉన్నాయి.

పద్మారావునగర్ డివిజన్

- **తూర్పు:** సెయింట్ అల్బన్ హైస్కూల్ వద్ద ప్రారంభమై పద్మారావునగర్, వెస్లీ చర్చిరోడ్డు ఎమడవైపు రామా అపార్టుమెంట్స్ మీదుగా పద్మారావునగర్ పార్క్ కుడివైపు జీఎస్ ప్రసాద్ క్లినిక్ స్కందగిరి ఆలయాన్ని కలుపుతూ పద్మారావునగర్ ప్రాంతం పద్మారావునగర్ స్ట్రీట్ 13 వద్ద ముగుస్తుంది.
- **దక్షిణం:** గాంధీ విగ్రహం, రోడ్డు నెంబర్ 13, పద్మారావునగర్ మీదుగా పద్మారావునగర్ పడమర అంతర్గత రోడ్డు బోయగూడ ప్రధాన దారి నుంచి కవాడీగూడ ప్రధానదారి వరకు.
- **పడమర:** కవాడీగూడ ప్రధానదారి నుంచి (6-4-43)ప్రారంభమై గాంధీ మెట్రోస్టేషన్ మీదుగా శ్రీపాండురంగ మిల్స్ నుంచి బోయగూడ రోడ్డు(మెట్రో పిల్లర్ 1011)మీదుగా బోయగూడ రోడ్డులోని మెట్రో పిల్లర్ నెం.బి.1300 వద్ద ముగుస్తుంది.
- **ఉత్తరం:** మెట్రో పిల్లర్ నెం.బి.1300 వద్ద ప్రారంభమై జామియా మసీద్, హమాల్‌బస్తీని కలుపుతూ..సెయింట్ అల్‌బన్ హైస్కూల్, పద్మారావునగర్ ముగుస్తుంది.

పద్మారావునగర్ డివిజన్ పరిధిలోకి ఈశ్వరమ్మ బస్తీ, బలరామ్ కాలనీ, వాకర్‌టౌన్, పద్మారావునగర్ పార్క్, స్కందగిరి కాలనీ, బ్రుక్‌బౌండ్ కాలని, అభినవనగర్ కాలనీ, పంచశీల కాలనీ, హమాల్‌బస్తీ ప్రాంతాలు వస్తాయి.

బన్సీలాల్‌పేట్ డివిజన్

- **తూర్పు:** మెట్రో పిల్లర్ బి.1297 సమీపంలో ప్రారంభమై బోయగూడ రోడ్డు ఎడమవైపున ఉన్న ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి, పాండురంగ మిల్స్ మీదుగా గాంధీ మెట్రో స్టేషన్ నుంచి కవాడీగూడ రోడ్డు వద్ద ముగుస్తుంది.
- **దక్షిణం:** కవాడీగూడ(6-4-45) వద్ద ప్రారంభమై కవాడీగూడ పడమర వైపున ఉన్న సీజీఓ టవర్స్ బోయగూడ రోడ్డు మీదుగా ఎస్‌హెచ్ ఆర్ మార్కెటింగ్ వద్ద ముగుస్తుంది.
- **పడమర:** ఎస్‌హెచ్‌ఆర్ మార్కెటింగ్ మీదుగా కవాడీగూడ ప్రధాన దారి గుండా ఉత్తరభాగం దేవీనగర్ రోడ్డు, బన్సీలాల్‌పేట్ రోడ్డు, ఆర్‌పీ రోడ్డు బన్సీలాల్‌పేట్ గాస్‌మండి రాజ్ ఎలక్ట్రికల్స్ వద్ద ముగుస్తుంది.
- **ఉత్తరం:** రాజ్ ఎలక్ట్రికల్స్ వద్ద ప్రారంభమై తూర్పు గాస్‌మండి రోడ్డు, అల్ఫా హోటల్, రైల్వే ట్రాక్(మెట్రో బ్రిడ్జి)సాయిబాబా ఆలయం (ఓల్డ్ గాస్‌మండి) బోయగూడ ఓల్డు బోయగూడ కలుపుతూ.. మెట్రో పిల్లర్ నెం.బి. 1297 వద్ద ముగుస్తుంది.

బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోకి సుందర్‌నగర్, దేవీనగర్,బన్సీలాల్‌పేట్,రామస్వామి కాంపౌండ్,చాచానేహ్రూనగర్,బీజెఆర్ నగర్, గాంధీనగర్,ఓల్డ్ బోయగుడా,న్యూబోయగుడా, రైల్ కళారంగ్ కాలనీ తదితర ప్రాంతాలు ఉంటాయి.

మోండా మార్కెట్ డివిజన్

- **తూర్పు:** అడ్డగుట్టలో ఉన్న మారేడ్‌పల్లి తహశీల్దార్ కార్యాలయం నుండి ప్రారంభం అయి రైల్వే భవన్ ఎదురుగా మెయిన్‌రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకు వద్ద ఎడమ వైపు నుండి రైల్వే అండర్ పాస్ వద్ద ముగుస్తుంది.
- **దక్షిణం:** రైల్వే భవన్ వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్ నుండి సికింద్రాబాద్ రైల్వే ట్రాక్ మీదుగా ఈస్ట్ రైల్వే స్టేషన్,రేతిఫైల్ బస్ స్టాండ్ గణేష్ టెంపుల్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా అల్ఫా హోటల్ ఎదురుగా ఉన్న బస్ స్టాండ్ వద్ద ముగుస్తుంది.
- **పడమర:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అల్ఫా హోటల్ ఎదురుగా ఉన్న బస్ స్టాండ్ వద్ద ప్రారంభం అయి ఆర్పీ రోడ్డు, దర్గా హజ్రాత్ సయ్యద్ జలాల్ షా బాబా వద్ద కుడి వైపు తిరిగి ఆర్పీ రోడ్డు మీదుగా మహబూబ్ కాలేజ్ వద్ద కుడి వైపు నుండి క్లాక్‌టవర్ వైఎంసీఏ ,ఎస్పీ రోడ్డును కవర్ చేస్తు హెచ్ఎండబ్ల్యూ అండ్ ఎస్‌బి వాటర్,సివిల్ కోర్టు ,వెస్ట్‌మారేడ్ పల్లి రోడ్డును కవర్ చేస్తు వెస్ట్ మారేడ్‌పల్లి స్ట్రీట్ నెం 13 సాయి బాబా టెంపుల్ కమాన్ వద్ద ముగుస్తుంది.
- **ఉత్తరం:** వెస్ట్ మారేడ్‌పల్లి స్ట్రీట్ నెం 13 సాయి బాబా టెంపుల్ కమాన్ వద్ద ఇంటి నెం 10-1-418 ,419 వద్ద కుడి వైపు తిరిగి కెపిఎన్ ఫ్రెష్ ప్లాట్ నెం 8 ఈస్ట్ మారేడ్‌పల్లి మెయిన్ రోడ్డు క్రాస్ చేస్తు అడ్డగుట్ట తహశీల్దార్ కార్యాలయం వద్ద ముగుస్తుంది.

ఈ డివిజన్‌లో టీచర్స్ కాలనీ, అంబేద్కర్‌నగర్, రైల్ నిలయం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతం, మోండ మార్కెట్, రెజిమెంటల్ బజార్, టకారబస్తీ, శౌజీనగర్, కుమ్మరిగూడ, ఎస్.డి.రోడ్డు, పరికబస్తీ, రైల్వే భవన్, సంచాలన్‌భవన్, వెస్లీ కాలేజీ, మారేడుపల్లి సివిల్ కోర్టు, వాటర్ బోర్డు, షెనాయ్ నర్సింగ్ హోమ్, మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాలు ఉన్నాయి.

తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాదే



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్



బోయినపల్లి ప్లే గ్రౌండ్ వద్ద సోనియా గాంధీ జన్మదిన వేడుకలలో పాల్గొన్న జంపన ప్రతాప్

బౌద్ధనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ సభ్యురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు సురేష్‌లాల్, జగ్గు నాయకులు సందీప్ ఎరాజు, అమర్‌నాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెజిమెంటల్‌బజార్‌లో కాంగ్రెస్ నాయకులు బాబూరావ్ ముదిరాజ్, అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, కేక్ శ్రీను, సదానంద్ గౌడ్, తేజ్‌పాల్, దేశం, రాజకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావునగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతా చిరంజీవి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు సి.పి.శంకర్, కాంతారావు, నస్రీన్, అనసూయ, దీపిక, శిల్ప, సలోమి, సాయి సందీప్, చంద్రశేఖర్, గజానంద్, ఆశిష్, రాజు, నిరంజన్, మల్లేశ్, లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు.

రాంగోపాల్‌పేట్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : నల్లగుట్టలోని ప్రభుత్వ ఉన్నత(ఓల్డ్) పాఠశాలలో రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు దండుగల మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్ జాన్ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కఠారి మహేష్, యువజన కాంగ్రెస్ నాయకుడు నాగరాజ్, టంక్ శ్రీనివాస్, రఘు యాదవ్, నూమన్, రహీం, సాధిక్, అఖిల్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి ప్లే గ్రౌండ్ వద్ద సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంపన ప్రతాప్ సోనియా చిత్రపటం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, శశిరాజ్ యాదవ్, వర ప్రసాద్, ముఖేష్ యాదవ్, కుమార్, సాయిబాబా యాదవ్ పాల్గొన్నారు.

మారేడుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శరీరంపై 25 కత్తి గాట్లు

● భర్తను రిమాండ్ చేసిన పోలీసులు ● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ● రాంనగర్‌లో ఘటన

బౌద్ధనగర్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకోవటంతో భర్త తాగిన మైకంలో భార్య శరీరంపై దారుణంగా 25చోట్ల కత్తితో పొడిచి గాట్లు పెట్టాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాంనగర్‌లో చోటు చేసుకుంది. ప్రసుత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్ లోటస్ మోడల్ స్కూలు సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో సిహెచ్.శైలజ(32) వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అపార్ట్‌మెంట్‌లోనే వాచ్‌మెన్ రూమ్‌లో ఉంటుంది. శైలజ భర్త చాకలి గోపాల్(38) ప్రైవేట్ బస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గోపాల్ మద్యానికి బానిసై తరచూ తాగి వచ్చి భార్యను వేధించటంతో పాటు తగాదాలు పడేవాడు. భర్త వేధింపులు భరించలేక కొన్నిరోజుల క్రితం సంగారెడ్డి హతోరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షంలో మాట్లాడుకోమని అక్కడి పోలీసులు సలహా ఇచ్చారు. గత వారం రోజులుగా గోపాల్ పనికి వెళ్లకుండా నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను మరింత వేధించసాగాడు. దీంతో శైలజ తన తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పగా తల్లి వచ్చి శైలజతో ఉంటుంది. 6వ తేదీ ఉదయం నుంచే మద్యం తాగుతూ భార్యను మాటలతో మరింత వేధించాడు. అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్త గోపాల్ 7వ తేదీ రాత్రి ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని నిద్రపోతున్న భార్యను విచక్షణ రహితంగా పొడిచాడు. శైలజ తల్లి కేకలు వేయటంతో పక్కింటి మహిళ కుమారి రావటంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తపుమడుగులో తీవ్రగాయాలై, అపారకస్మితిలో ఉన్న శైలజను స్థానికులు, కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వారు చికిత్సకు నిరాకరించటంతో అంబర్‌పేట్‌లోని సీజన్ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారమందుకున్న పోలీసులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శైలజ నుంచి వివరాలు సేకరించారు. శైలజ శరీరంపై 25 కత్తిగాట్లు పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం శైలజ భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రసుత్తం శైలజ పరిస్థితి ఆందోళకరంగా ఉందని బంధువులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శైలజ

ఘనంగా విజయ్ దివస్

బౌద్ధనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండీ, బౌద్ధనగర్ డివిజన్లలో మంగళవారం విజయ్ దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండీ అంబేద్కర్ విగ్రహం వద్ద కార్పొరేటర్ సామల హేమ, వారాసిగూడ చౌరస్తాలో బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది‌శైలజలు అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2009 డిసెంబరు 9న కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్షకు తలొగ్గి అప్పటి కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిన రోజు కావటంతో ఆ తేదీని తెలంగాణ సాధనలో విజయంగా సాధించిన రోజుగా విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నట్లు కార్పొరేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, శైలేందర్, బెజ్జంకి రాజేశ్, పాక సాయి, రాము, కన్నా, సచిన్, బాబా మాజీ కార్పొరేటర్ కందినారాయణ పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సామల హేమ

అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం తుకారాంగేట్‌లోని లాలాగూడ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, అమర్, రవి, రామస్వామి, అల్లాబకాష్, శ్రీరాములు, రామప్ప, సంతోష్, శివకుమార్, వెంకటేష్, గోపి. దేవా, గోనే, బాబు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



వారాసిగూడ చౌరస్తాలో వేడుకల్లో బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ తదితరులు



తుకారాంగేట్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

బోయినపల్లిలో..

బోయినపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) :కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. మాజీ బోర్డు సభ్యులు అనితా, నళినీ కిరణ్, ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.